కలగానే బస్ షెల్టర్ నిర్మాణం

- ప్రయాణికులకు నిలువ నీడ కరువు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- ఎన్నికల సమయంలో హామీలకే పరిమితం

ప్రభుత్వాలు మారినా, పాలకులు మారినా పాములపాడు బస్ షెల్టర్ నిర్మాణం మాత్రం కలగానే మిగిలిపోయింది. నిత్యం వందలాది మంది ప్రయాణికులకు నిలువనీడ లేకపోవడం, మల మూత్రశాలలు లేకపోవడం తీవ్ర సమస్యగా మారింది. సమస్య ఎంత తీవ్రంగా ఉన్నా పట్టించుకునే వారే కరువయ్యారు. ఎన్నికల సమయంలో రాజకీయ నాయకులకు ప్రధాన హామీగా మిగిలిపోయింది. – పాములపాడు


షెల్టర్ లేని పాములపాడు బస్టాండ్ కూడలి

పాములపాడు మండల కేంద్రంలో బస్‌షెల్టర్ నిర్మాణం లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని పలు గ్రామాల నుంచే గాకుండా సమీపంలో ఉన్న కొత్తపల్లి, జూపాడుబంగ్లా మండలాల ప్రజలు కూడా పాములపాడు మీదుగానే కర్నూలుకు రాకపోకలు సాగిస్తున్నారు. ప్రతి రోజు సుమారు వెయ్యి మందికిపైగా ప్రయాణికులు పాములపాడు మండల కేంద్రం నుంచి బస్సు, ఆటో, ఇతర వాహనాల్లో గమ్యస్థానాలు చేరుకుంటున్నారు.

పట్టించుకునే వారేరీ?

బస్ షెల్టర్ గురించి పట్టించుకునే వారే కరువయ్యారని ప్రజలు, ప్రయాణికులు వాపోతున్నారు. ఎంతో మంది జిల్లా అధికారులు మండలానికి రావడమే తప్పా ప్రయాణికుల సౌకర్యార్థం బస్ షెల్టర్ నిర్మాణం గురించి పట్టించుకున్న పాపాన పోలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

మౌలిక సదుపాయాలు కరువు

బస్ షెల్టర్ లేకపోవడంతోపాటు మౌలిక సదుపాయాలు కరువయ్యాయి. మల మూత్రశాలలు, తాగునీటి సదుపాయం లేకపోవడంతో బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు పడే అవస్థలు అన్నీ ఇన్నీ కావు. పురుషులైతే ఎలాగోలా ఆరుబయట అవసరాలు తీర్చుకుంటున్నారు. మహిళా ప్రయాణికుల పరిస్థితి అయితే మరింత దారుణం. అయినా ఏ ఒక్క ప్రజాప్రతినిధి గానీ, అధికారులు గానీ పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి.

ఇరువైపులా విస్తరన పనులు

ఇటీవల అధికారులు బస్టాండ్ సెంటరులో రహదారుల కిరువైపులా విస్తరణ పనులు చేపట్టారు. ఈ విషయంపై కొందరు హర్షం వ్యక్తం చేస్తుండగా మరి కొందరు విమర్శలు చేస్తున్నారు. విస్తరణలో భాగంగా వ్యాపార దుకాణాల ఎదుట ఏర్పాటు చేసుకున్న మెట్లు, రేకులను తొలగించారు. అయితే ప్రయాణికులు కూర్చునేందుకు బల్లలు ఏర్పాటు చేశారు. ఇదంతా బాగానే ఉన్నా వానొచ్చినా, ఎండ ఉన్నా ప్రయాణికులు బల్లలపై ఎలా కూర్చుంటారని పలువురు ప్రశ్నిస్తున్నారు.

రేకులు ఏర్పాటు చేశాను



బస్‌స్టాండ్‌లో నాకు చిన్న దుకాణం ఉంది. గతంలో రేకులు ఉన్నాయని అధికారులు తొలగించారు. వర్షం కురిసే సమయంలో ప్రయాణికులు అంగడి వద్దకు వస్తున్నారు. కనీసం నిలబడటానికి కూడా వీలు లేదు. మాకు వ్యాపారం కోసమే కాకుండా ప్రయాణికులకు కనీసం నిలబడటానికి అయినా బాగుంటుందనే ఉద్దేశంతో రేకులు ఏర్పాటు చేశాను. – శంకరయ్యశెట్టి, పాములపాడు

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా



ప్రజల నుంచి బస్ షెల్టర్ సమస్యపై మెమొరాండం వస్తే తహసీల్దార్, ఆర్డీఓల దృష్టికి తీసుకెళ్తాం. స్థలం సేకరించాలి, బస్ షెల్టర్ నిర్మాణానికి నిధులు మంజూరు కావాలి. అప్పుడే బస్ షెల్టర్ నిర్మాణానికి చర్యలు తీసుకునేందుకు వీలుంటుంది. స్థానిక ప్రజా ప్రతినిధులు కూడా ఈ విషయంపై దృష్టి సారిస్తే సమస్య పరిష్కారానికి అవకాశం ఉంటుంది. వాహనాల రద్దీ ఎక్కువగా ఉందని, కనీసం ప్రజలు నడవడానికి ఇబ్బంది పడుతుండటంతో విస్తరణ పనులు చేపట్టాం. – చంద్రశేఖర్, ఎంపీడీఓ

అధికారులు నిర్లక్ష్యం వీడి నీళ్లు వదలాలి

కొత్తపల్లి: నీటిపారుదల శాఖ అధికారులు నిర్లక్ష్యం వీడి శివపురం, సంగమేశ్వరం ఎత్తిపోతల పథకాల ద్వారా పైర్లకు సాగునీరు విడుదల చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి. ఏసురత్నం, మండల కార్యదర్శి ఎస్.స్వాములు డిమాండ్ చేశారు. శనివారం వారు మాట్లాడుతూ కృష్ణా నదిలో నీళ్లు పుష్కలంగా ఉన్నా శివపురం, సంగమేశ్వరం ఎత్తిపోతల పథకాల కింద సాగు చేసిన పంటలు ఎండిపోతున్నాయన్నారు. ఉన్నతాధికారులు స్పందించి సాగునీరు విడుదలకు చర్యలు చేపట్టి రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

వ్యవసాయ కూలీ మృతి

పాములపాడు: మండల కేంద్రానికి చెందిన వ్యవసాయ కూలీ తమ్మడపల్లి బాల సుందరం (65)గుండెపోటుతో మృతి చెందాడు. శనివారం చెలిమిళ్ల గ్రామంలో రైతు భూషణంకు చెందిన మొక్కజొన్న పొలంలో పనులకు వెళ్లాడు. మధ్యాహ్నం భోజనం చేసిన అనంతరం పనులు చేస్తుండగా హఠాత్తుగా గుండె నొప్పి రావడంతో పొలంలోనే కుప్పకూలిపోయాడు. గమనించిన రైతులు హుటాహుటిన పాములపాడులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. నాలుగు నెలల క్రితం మృతుని భార్య జయమ్మ కూడా గుంటూరు జిల్లాకు వలస కూలీగా వెళ్లి వడదెబ్బతో అక్కడే మృతి చెందింది.

క్లుప్తంగా

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ద్విచక్రవాహనాలు


ద్విచక్రవాహనాలతో సీఐ ప్రసాదరావు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాపుణ్యక్షేత్రంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు శ్రీశైలం పట్టణ పోలీసు స్టేషన్‌కు ప్రభుత్వం రెండు ద్విచక్రవాహనాలు అందించింది. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, ఆలయ పరిసరాలలో రాత్రి, పగలు గస్తీ తిరేగేందుకు వాహనాలను ఉపయోగిస్తామని సీఐ జి.ప్రసాదరావు తెలిపారు.

అలరించిన గాత్ర కచేరి



భక్తి గీతాలను ఆలపిస్తున్న కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శనివారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళా వేదికపై ఎన్‌టీఆర్ జిల్లాకు చెందిన సంధ్యా త్రివేణి, బృందం గాత్రకచేరి ఆకట్టుకుంది. శక్తి సహిత గణపతి, ముదాకరాత్త మోదకం, కైలాసగిరిలోన, శంకర శివశంకర, నమః శివాయా నటేశ్వరాయ, శంభో శివశంభో, పాహి పాహి గజననా తదితర గీతాలను రేణు శ్రీ, జ్ఞన, లాస్యప్రియ, నందిని, గోపి, సంధ్యా త్రివేణి తదితరులు ఆలపించారు.

శ్రీశైలంలో ట్రాఫిక్ జామ్


లింగాలగట్టు వద్ద నిలిచిపోయిన వాహనాలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలంలో ట్రాఫిక్ జామ్ అయింది. శ్రీశైలం నుంచి హైదరాబాద్ రహదారిలో సుమారు ఐదు కిలోమీటర్లకుపైగా ట్రాఫిక్ జామ్ అయింది. శ్రీశైలం డ్యాం క్రస్ట్‌గేట్లు తెరవడంతో శనివారం సెలవు రోజు కావడంతో తెలంగాణ ప్రాంతం నుంచి భారీగా భక్తులు వాహనాల్లో తరలివచ్చారు. డ్యాం వద్ద పలువురు పర్యాటకులు వాహనాలను నిలుపుదల చేసి డ్యాంను సందర్శించడంతో వాహనాల రద్దీ పెరిగిపోయి ట్రాఫిక్ జామ్‌కు కారణమైంది. లింగాలగట్టు వద్ద కూడా వాహనాలు నిలుపుకుని చేపల విక్రయాలు జరపడం ట్రాఫిక్ జామ్‌కు మరో కారణంగా తెలుస్తోంది. పోలీసులు శ్రమించి ట్రాఫిక్ జామ్‌ను క్రమబద్ధీకరించారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం


అమలాపురంలో జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఆత్మకూరు: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం అమలాపురం, శ్రీపతిరావుపేట గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు దేవసహాయం, నియోజకవర్గ కార్యదర్శి రామారావు తదితరులు పాల్గొని సమితి జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు నాగశేషులు, రావిన్సన్ మాదిగ, దర్గయ్య మాదిగ, మదనపల్లి బుజ్జి మాదిగ, నాగయ్య, తిమ్మరాజు, వనమాల పుల్లయ్య, రంగస్వామి, మల్లయ్య, చిన్నస్వాములు పాల్గొన్నారు.

కారు-ఆటో ఢీ

మహానంది: మహానందిలోని పార్వతీపురం టోల్‌గేట్ సమీపంలో శనివారం రాత్రి ఆటో, కారు ఢీకొన్నాయి. నరసరావుపేట పట్టణానికి చెందిన పలువురు భక్తులు మహానందీశ్వరస్వామి దర్శనానికి వచ్చారు. తిరుగు ప్రయాణంలో గాజులపల్లె వైపు ఉన్న టోల్ గేట్ వద్ద ఆటో, కారు ఢీకొన్నాయి. ప్రమాదంలో కారుకు డ్యామేజ్ అయిందని బాధితులు చెప్పారు. ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి వివరాలు సేకరించారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగించొద్దు

మహానంది: గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి హెచ్చరించారు. సీతారామపురంలో శనివారం రాత్రి పర్యటించి, శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు.

ఆక్రమణల తొలగింపు

మహానంది: స్థానిక పార్వతీపురం కాలనీ వద్ద రోడ్డు పక్కనే ఉన్న అటవీశాఖ భూమిలో ఏర్పాటు చేసిన దుకాణాలు, హోటళ్లను అటవీశాఖ అధికారులు శనివారం తొలగించారు. డీఆర్‌ఓ హైమావతి, ఎఫ్‌బీఓలు ప్రతాప్, శ్రీనివాసులు, సిబ్బంది దుకాణాల వద్దకు చేరుకుని దుకాణాలను తొలగించారు. మిగతా దుకాణాలకు గడువు ఇచ్చారు.

మధ్యవర్తిత్వంతో కేసులు పరిష్కరించుకోండి


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న న్యాయవాది వెంకటమరణ

నందికొట్కూరు: కోర్టులో పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల కేసులను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కారం చేసుకోవచ్చని న్యాయవాది వెంకటరమణ సూచించారు. శనివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ప్రాంతంలో మండల న్యాయ సేవా సంఘం అధ్యక్షులు, సీనియర్ సివిల్ జడ్జి ఎ.శోభరాణి ఆదేశాల మేరకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీ కావాలనుకునే కక్షిదారులు స్థానిక కోర్టును, జిల్లా కోర్టును ఇరుపక్షాలు స్వయంగా, లేఖ ద్వారా కానీ తెలపవచ్చని పేర్కొన్నారు. అటువంటి వారు మధ్యవర్తిత్వం ద్వారా రాజీ చేసుకునే అవకాశం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో పారా లీగల్ వలంటీర్లు శోభరాణి, కెజియా, రెహ్మాన్, హుసేన్ పాల్గొన్నారు.

సమ్మె కాలపు ఒప్పందాలు అమలు చేయాలి


రిలే నిరాహార దీక్షల్లో పాల్గొన్న మున్సిపల్ కార్మికులు

ఆత్మకూరు: మున్సిపల్ కార్మికులకు సమ్మె కాలపు ఒప్పందాలను అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యేసురత్నం, రామ్‌నాయక్ ప్రభుత్వాన్ని కోరారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్షలను శనివారం కొనసాగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులను కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో గాకుండా ప్రభుత్వ ఉద్యోగులుగు గుర్తించాలన్నారు. సమ్మెకాలంలో ఒప్పందాలను, రిటైర్‌మెంట్ బెనిఫిట్, ఎక్స్‌గ్రేషియాను రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షలకు పెంచాలన్నారు. పెండింగ్‌లో ఉన్న పీఎఫ్‌ను చెల్లించాలన్నారు. సమస్యలన్నింటినీ పరిష్కరించి తమకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ, మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు నాగన్న, పెద్ద నాగరాజు, జయన్న, తిమ్మయ్య, రాజా, సురేష్, సామక్క, సువర్ణమ్మ పాల్గొన్నారు.

వీఓఏ తొలగింపునకు రాజకీయ ఒత్తిళ్లు


మాట్లాడుతున్న దళిత సంఘాల నాయకులు

పాములపాడు: మండలంలోని మద్దూరు గ్రామంలో వెంకటసాయి గ్రామైఖ్య సంఘం వీఓఏ దళిత మహిళ ప్రియాంకను తొలగించాలంటూ రాజకీయ ఒత్తిళ్లు చేయడం సరైంది కాదని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎంఎస్పీ జిల్లా అధికార ప్రతినిధి కోట ప్రభాకర్, జాతీయ మాల మహానాడు రాయలసీమ అధ్యక్షుడు అబ్రహాం అన్నారు. శనివారం మండల కేంద్రంలో వారు మాట్లాడుతూ 4 ఏళ్లుగా ఎలాంటి రిమార్కు లేకుండా విధులు నిర్వహిస్తున్న వీఓఏపై ఏపీఎం ఉమామహేశ్వరి రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి రాజీనామా చేయాలంటూ వేధిస్తున్నారని ఆరోపించారు. ఉద్యోగం కాపాడుకోవాలంటే రాజకీయ నాయకుల కాళ్లు మొక్కి ఉద్యోగం కాపాడుకో అని ఉచిత సలహా ఇచ్చారన్నారు. ఈ సమస్యపై నియమించిన ఉన్నతాధికారి గ్రామంలోని 16 సంఘాల సభ్యులతో విచారణ చేయగా ప్రియాంక పని తీరు గురించి సానుకూలంగా చెప్పడం జరిగిందన్నారు. వేధింపులపై జిల్లా ఎస్పీ, ఆత్మకూరు డీఎస్పీలను కలిసి విన్నవించినా న్యాయం జరగలేదని వాపోయారు. దళిత మహిళను టార్గెట్ చేస్తూ వేధింపులకు గురిచేస్తున్న వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి వీఓఏకు న్యాయం చేయాలని వారు కోరారు. సమావేశంలో దళిత సంఘాల నాయకులు నాగరాజు, మోహన్, శ్రీనివాసులు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మహానందిలో న్యాయమూర్తి పూజలు


వేదపండితుల ఆశీర్వచనం అందుకుంటున్న న్యాయమూర్తి భాస్కర్, కుటుంబసభ్యులు

మహానంది: మహానందీశ్వరుడి సన్నిధిలో ఆళ్లగడ్డ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ భాస్కర్, కుటుంబ సభ్యులు శనివారం పూజలు నిర్వహించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ నాగమల్లయ్య స్వాగతం పలికారు. కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. అనంతరం కల్యాణ మండపంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని వేదాశీర్వచనం చేసి స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించారు.

తొలి అడుగు కాదది తప్పటడుగు

- కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజల దృష్టికి తీసుకెళదాం
- స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుదాం
- వైఎస్సార్‌సీపీ శ్రేణులకు శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి దిశానిర్దేశం


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు

వెలుగోడు: టీడీపీ నేతలు చేపట్టింది తొలి అడుగు కాదని, అది ముమ్మాటికీ తప్పటడుగు కార్యక్రమమే అని వైఎస్సార్‌సీపీ శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి విమర్శించారు. అధికారంలోకి రావడానికి ఇచ్చిన హామీలలో ఒక్కటి కూడా అమలు చేయకుండా ప్రజలను మభ్యపెట్టడానికే టీడీపీ నాయకులు ప్రజల వద్దకు వెళ్లి అవమానాలకు గురవుతున్నారన్నారు. శనివారం వైఎస్సార్‌సీపీ మండల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ×రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో¤ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శిల్పా చక్రపాణిరెడ్డి మాట్లాడుతూ.. ఈనెల 21 నుంచి ప్రతి రోజు రెండు గ్రామాల్లో ఉదయం, సాయంత్రం పర్యటించి బాబు ష్యూరిటీ– మోసం గ్యారంటీ, ×రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో¤ కార్యక్రమంతో ప్రజల్లోకి వెళ్దామన్నారు. చంద్రబాబు ఒక అబద్ధాన్ని కప్పిపుచ్చుకోవడానికి మరో అబద్ధం చెబుతూ దగా చేస్తున్న వైనాన్ని ప్రజలకు వివరించాలన్నారు. కూటమి ప్రభుత్వంలో కరెంట్ బిల్లులు పెంచడం, ఇసుక, మద్యంలో కూటమి నేతలు సిండికేట్లుగా మారి ప్రజాధనాన్ని దోచుకు తింటున్న తీరుపై ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. చంద్రబాబు చేస్తున్న మోసాలను ప్రజలకు వివరిస్తూ ప్రతిఒక్కరి స్మార్ట్ ఫోన్‌లో క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి మోసపూరిత విధానాలను ఎండగట్టాలన్నారు. అన్ని వర్గాలను వంచించిన చంద్రబాబు ప్రభుత్వానికి స్థానిక సంస్థల ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు.

బుడ్డా.. మీ ఊర్లోనే అభివృద్ధి చేశాం

ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి సొంత ఊరు వేల్పనూరులోనే గత ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో ఎంతో అభివృద్ధి చేశామని మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. వేల్పనూరులో పైస్థాయి ఆరోగ్య కేంద్రానికి సొంత భవనాలు నిర్మించామని, గ్రామ సచివాలయాలు, రోడ్లు వేయించామని చెప్పారు. వెలుగోడులో సీహెచ్‌సీ నిర్మాణం చేపట్టినట్లు చెప్పారు. మండలంలో అన్ని గ్రామాలకు రోడ్లు నిర్మించింది తామేనన్నారు. రూ.350 కోట్ల నిధులతో తెలుగుగంగా లైనింగ్ పనులు చేపట్టామని గుర్తు చేశారు. సున్నిపెంటలో తన పేరిట గజం స్థలం ఉన్నట్లు నిరూపించినా శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకుంటానని సవాల్ విసిరారు. అవాకులు, చవాకులు పేల్చడం మాని అభివృద్ధిపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు శిల్పా భువనేశ్వర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు దేశం తిరుపంరెడ్డి, జిల్లా కో–ఆప్షన్ సభ్యుడు ఇలియాస్‌ఖాన్, ఎంపీపీ లాలం రమేష్, సర్పంచ్ వేల్పుల జయపాల్, వైస్ ఎంపీపీలు శంకర్‌నాయక్, చికెన్ బాబు, నాయకులు రామ్మోహన్‌రెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోగోలు శివశంకర్‌నాయుడు, బోగోలు సుదర్శనం, నాగేశ్వరరెడ్డి, శ్రీనివాసులు, షంషీర్ అలీ, నాగలక్ష్మిరెడ్డి, యేసురత్నం పాల్గొన్నారు.

అబద్ధపు హామీలపై నిలదీద్దాం

బండి ఆత్మకూరు/మహానంది: ఎన్నికల్లో కూటమి నాయకులు సూపర్–6 పేరుతో ఇచ్చిన అబద్ధపు హామీలపై ప్రజలతో కలిసి నిలదీద్దామని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి సూచించారు. శనివారం నంద్యాల పద్మావతి నగర్‌లోని తన కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ బండిఆత్మకూరు, మహానంది మండలాల విస్తృతస్థాయి సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా మండలాల నాయకులతో ఆయన మాట్లాడుతూ కూటమి నాయకులు ఎన్నికల్లో అలివిగాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయకుండా తుంగలో తొక్కారన్నారు. ఇదే విషయాన్ని గ్రామాల్లో పర్యటించి ప్రజలకు వివరించాలన్నారు. సమావేశంలో పార్టీ నాయకుడు శిల్పా భువనేశ్వర రెడ్డి, బండిఆత్మకూరు మండల అధ్యక్షుడు బారెడ్డి విజయభాస్కర్ రెడ్డి, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు రాజం రెడ్డి సుజాతమ్మ, ఇంటలెక్చువల్ ఫోరం నియోజకవర్గ అధ్యక్షులు ఇటికల చిన్న సుబ్బారెడ్డి, యువజన విభాగం జిల్లా అధ్యక్షులు కడిపిరెడ్డి దిలీప్ రెడ్డి, మాజీ ఎంపీపీ దేసు వెంకటరామిరెడ్డి, మహానంది మండల అధ్యక్షుడు కొమ్మా మహేశ్వరరెడ్డి, జెడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బూత్ లెవెల్ ఆఫీసర్లు హాజరు కావాలి

పాములపాడు: ఈనెల 15న నిర్వహించే సమావేశానికి మండలంలోని బూత్ లెవెల్ ఆఫీసర్లు హాజరు కావాలని తహసీల్దార్ సుభద్రమ్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎర్రగుడూరు గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో సమావేశం ఉంటుందన్నారు.

కేసు నమోదు

బండి ఆత్మకూరు: అజాగ్రత్తగా మోటార్ సైకిల్ నడుపుతూ ఇద్దరు గాయపడటానికి కారణమైన వ్యక్తిపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జగన్‌మోహన్ తెలిపారు. పార్నపల్లి గ్రామానికి చెందిన వికలాంగుడు దుద్దుకూరి సుంకన్న కాకునూరు రోడ్డులోని తెలుగుగంగ పిల్లకాలువ వద్ద తన కొడుకుతో కలిసి ట్రైసైకిల్‌పై వెళ్తుండగా అదే గ్రామానికి చెందిన వడ్డే శ్రీకాంత్ బైక్‌తో ఢీకొట్టడంతో తండ్రీ, కుమారుడు గాయపడ్డారన్నారు. బాధితుడు సుంకన్న ఫిర్యాదు మేరకు శ్రీకాంత్‌పై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో హోమాలు


హోమాలు చేయిస్తున్న భక్తులు

మహానంది: మహానంది పుణ్యక్షేత్రంలోని యాగశాలలో శనివారం వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, హనుమంతుశర్మ ఆధ్వర్యంలో భక్తులు రుద్ర, చండీ హోమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గణపతిపూజ, పుణ్యాహవాచనం, రుద్ర, చండీ, మహా మృత్యుంజయ హోమాలు చేసుకున్నారు.

- ఆషాడమాసం పురస్కరించుకుని నంద్యాల, మహానంది గ్రామాలకు చెందిన ఆర్యవైశ్య మహిళలు మహానందిలో కామేశ్వరీదేవి అమ్మవారికి చీర, సారె సమర్పించారు.

అప్పు తీర్చే మార్గం లేక ఉద్యోగి ఆత్మహత్య

కర్నూలు: ఇంటి నిర్మాణం, పిల్లల చదువులు, కుటుంబ పోషణ కోసం చేసిన అప్పులు తీర్చే మార్గం లేక కర్నూలు పశుసంవర్ధక శాఖలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న దుద్యాల శేషేంద్రనాథ్ (48) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈయన పసుపల గ్రామ పంచాయతీ పరిధిలోని మల్లారెడ్డి వెంచర్‌లో కొత్తగా ఇల్లు నిర్మించుకున్నాడు. ఇందుకోసం బ్యాంకులో రూ.48 లక్షలు అప్పు చేశాడు. అలాగే పిల్లల చదువులు, కుటుంబ పోషణ కోసం కూడా బయట మరికొంత అప్పులు చేశాడు. వచ్చే జీతం బ్యాంకు ఈఎంఐ చెల్లింపులతో పాటు కుటుంబ పోషణకు సరిపోకపోవడంతో తీవ్ర మనస్థాపానికి గురై ఇంటికి సమీపంలోని మసీదు దగ్గర ఉన్న బహిరంగ ప్రదేశంలో శుక్రవారం పురుగుల మందు తాగి ఇంటికి చేరుకున్నాడు. కుటుంబ సభ్యులు కనుగొని ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్సలు చేయించగా కోలుకోలేక శనివారం ఉదయం మృతిచెందాడు. ఈయనకు వేణుమాధవ్, భానుకిరణ్ కుమారులు. భార్య దుద్యాల మంజుల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కర్నూలు అర్బన్ తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కూటమిలో రాజుకున్న వంట కుంపటి

- వంట మనిషి నియామకం కోసం వీధికెక్కిన అధికార పార్టీలోని రెండు వర్గాలు


పడమర ప్రాతకోట ప్రాథమిక పాఠశాల

పగిద్యాల: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామాల్లో ఆధిపత్య పోరు తారాస్థాయికి చేరుకుంటోంది. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు ప్రత్యక్షంగా, పరోక్షంగానైనా, అధికారులు పనులు చేయొద్దని స్వయాన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడే పేర్కొనడంతో కూటమి నాయకులకు వెయ్యి ఏనుగుల బలం వచ్చినట్లు జబ్బలు చరుచుకుంటున్నారు. ఇటీవల జరిగిన ఎస్సీ, బీసీ కార్పొరేషన్ బ్యాంక్ రుణాల్లో సైతం తమ అనుయాయులకు రుణాలు మంజూరు చేయించేందుకు బ్యాంకర్లపై చేసిన హైరానా అంతా ఇంతా కాదు. ఆ అనుభవాలను ప్రజలు మరవక ముందే ఆధిపత్యం కోసం రెండు వర్గాలుగా చీలిపోయిన ఎమ్మెల్యే వర్గీయులు వంట మనుషుల నియామకంలో కూడా తమ పెత్తనాన్ని షురూ చేసిన ఉదంతం ఆలస్యంగా పడమర ప్రాతకోటలో వెలుగు చూసింది.

స్థానిక సంతమార్కెట్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 1 నుంచి 5 తరగతుల వరకు 70 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. గతంలో ఒకటి, రెండు తరగతులు ఉండగా వంట మనిషి ఒక్కరే పనిచేస్తూ వచ్చారు. జెడ్పీ పాఠశాలలకు వెళ్లిన 3, 4, 5 తరగతుల విద్యార్థులను మళ్లీ ప్రాథమిక పాఠశాలలకు రప్పించడంతో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. దీంతో అదనంగా మరో వంట మనిషి అవసరం ఏర్పడింది. ఈ పోస్టును తాము చెప్పిన మనిషికే ఇవ్వాలని ఎమ్మెల్యే వర్గంలోని వెంకటరెడ్డి, బాలీశ్వరగౌడ్, ఆర్ఎంపీ నాగశేషులు, రమణ మరికొందరూ హెచ్ఎంపై ఒత్తిడి చేసినట్లు సమాచారం. ఈ విషయం తెలుసుకున్న మరో వర్గం సభ్యులు కర్ణ, ప్రతాప్, సాంబ, ఈదుల కర్ణ ఒంటరి మహిళ పేరును ఎమ్మెల్యేకు సిఫారసు చేసినట్లు తెలుస్తోంది. దాదాపు 20 రోజులుగా పాఠశాలలలో రగులుకున్న ఈ కుంపటి చినికి చినికి గాలివానలా మారి ఒకరికొకరు పరస్పర వ్యక్తిగత దూషణలు చేసుకునే స్థాయికి చేరుకుంది. మొన్నటి వరకు ప్రతిపక్ష పార్టీలో ఉండి ఊసరవెల్లిలా రంగులు మార్చుకుంటూ కూటమిలోకి చేరి పెత్తనం చెలాయిస్తే సహించేది లేదని వార్నింగ్‌ల దాకా వెళ్లడం గ్రామంలో తీవ్ర చర్చనీయాంశమైంది. కాగా మధ్యాహ్న భోజనానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఒక్కరితోనే వంట చేయిస్తూ వస్తున్న హెచ్ఎం.. తమపై అధికారుల నుంచి వచ్చే ఆదేశాల ప్రకారం నడుచుకునే వాళ్లమే కానీ సొంత నిర్ణయాలు తీసుకోలేమని ఇరువర్గాలకు చెప్పినట్లు సమాచారం. ఏదిఏమైనా పిల్లలకు పాఠాలు చెప్పాలా లేక రాజకీయ నాయకుల ఆధిపత్యం కోసం సృష్టించే సమస్యలను పరిష్కరించాలా అంటూ మండల స్థాయి అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఈ విషయమై మండల విద్యాధికారి సుభాన్‌ను వివరణ కోరగా.. వంట మనిషి నియామకం కోసం సిఫారసు లెటర్‌లు వచ్చాయని, ఎమ్మెల్యే దృష్టికి వెళ్లిందని త్రీమెన్ కమిటీతో ఆలోచించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

సార్.. పంటలను కాపాడండి!


ఎండుతున్న మొక్కజొన్న పంటను చూపుతున్న రైతు

కొత్తపల్లి: శివపురం, సంగమేశ్వరం ఎత్తిపోతల పథకాల ద్వారా నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని రైతులు అధికారులను కోరుతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో భాగంగా రైతులు మొక్కజొన్న సాగు చేశారు. కాగా వర్షాలు లేకపోవడంతో పంటలు ఎండిపోయే ప్రమాదం నెలకొందని పెద్దగుమ్మడాపురం రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ గ్రామంలో సుమారు 350 ఎకరాల దాక రైతులు మొక్కజొన్న పంట సాగు చేశారు. దాదాపు 20 రోజులుగా వర్షాలు లేకపోవడంతో పంటలు చేతికందే పరిస్థితి లేదు. దగ్గర్లో ఉన్న శివపురం, సంగమేశ్వరం ఎత్తిపోతల పథకాల ద్వారా నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని రైతులు కోరుతున్నారు.